

# మార్పు

**సిరి**

**"శ్రీ సూర్యనారాయణా మేలుకో
హరి సూర్య నారాయణా"**

**గుడిలో సుప్రభాతం చెవిన పడగానే టక్కున మేలుకున్న నాకు ఆరోజు ఆదివారం అన్న విషయం గుర్తుకొచ్చి మనస్సంతా ఆనందంతో నిండి పోయింది.**

ఈ రోజు రమ్య దగ్గర నుంచి ఫోను వస్తుంది. అదే నా సంతోషానికి కారణం.

రమ్య అనబడే ఒక అందాల దేవతను ఏడేళ్లుగా ఆరాధిస్తున్న భక్తుడిని నేను.

ఎనిమిదేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయిన నేను నానమ్మ ఒడిలో గారాబంగా పెరిగాను. నానమ్మకు నేనంటే పంచ ప్రాణాలు. నాకూ అంతే.

ఎప్పుడైనా మనసు బాగోనప్పుడు ఆమె ఒడిలో తలపెట్టుకొని పడుకోవడం నాకు అలవాటు. నానమ్మ తన అమృత హస్తంతో నా తల నిమురుతూ ఉంటే బాధలన్నీ దూదిపింజాల్లా తేలిపోయేవి.

మా ఊళ్లో మాకు లంకంత ఇల్లు, పొలం, మామిడి తోటలు ఉన్నాయి. దానికి సంబంధించిన వ్యవహారాలన్నీ నానమ్మే చూసుకునేది.

నానమ్మది మంచి మనసవడం వల్ల కాబోలు పనివాళ్లు కూడా ఎంతో నమ్మకంగా ఉంటున్నారు.

నేను టెన్త్ క్లాసు మంచి మార్కులతో పాస వడం చూసి నానమ్మ నన్ను పట్నం తీసుకొచ్చి కాలేజీలో చేర్పించింది. నన్ను హాస్టల్‌లో వదిలి వెళుతూ కన్నీళ్లు పెట్టుకొంది. "నువ్వు బాగా చదివి మీ తాతయ్యలా మంచి డాక్టరువి కావాలిరా పండూ... అందుకే నిన్నిక్కడ వదిలి వెళుతున్నాను. లేకపోతే ఈ ముసలి ప్రాణం నిన్ను చూడకుండా ఉండగలదా" నన్ను కౌగిలించుకొని నా తల నిమురుతూ అంది నానమ్మ.

"అబ్బా... వదులు నానమ్మ... ఎవరైనా చూస్తే బాగోదు" అన్నాను నానమ్మకు దూరంగా జరుగుతూ...

నిజం చెప్పాలంటే నాకూ ఏడుపొచ్చింది తర్వాత.

ఈ హాస్టల్ వాతావరణం, భోజనం నచ్చక తిరిగి మా ఊరికి పారిపోదామా అనుకుంటున్న తరుణంలో

మా క్లాసులోకి అడుగుపెట్టిందో అద్భుత సౌందర్యం.

పున్నమి చంద్రుడి నుంచి జారిపడిన వెన్నెల తునకలా... అప్పుడే విచ్చుకుంటున్న గులాబీలా స్వచ్ఛంగా, సుకుమారంగా, కోమలంగా ఉంది ఆమె.

వెన్నెల్లో కూచుని ఆ హాయిని అనుభవించడం ఎవరి కిష్టముండదు? నాలాగే ఎంతో మంది అబ్బాయిలు ఆమె కరుణా కటాక్షాల కోసం వీక్షిస్తున్నారు. కానీ ఆ దేవత వాళ్లెవరినీ కన్నెత్తి చూడలేదు. నన్ను... నన్నే చూసి నవ్వింది ఒకరోజు.

కొన్నాళ్ల తరువాత పలుకరించింది. మరి కొన్నాళ్ల తరువాత నన్ను చూసి సిగ్గుపడేది.

అప్పుడే నాకూ తెలిసింది. నేనూ అందగాడినే అన్న విషయం. అలా నా గుండెల్లో స్థానం ఏర్పర్చుకున్న దేవతే రమ్య.

రమ్యకో చెల్లెలుందని, తండ్రి పంచాయతీ రాజ్‌లో ఇంజనీరనీ, తల్లి హౌస్‌వైఫ్ అని నా స్నేహితుని ద్వారా తెలిసింది. మొదటి సంవత్సరం మా మధ్య అలా మౌన ప్రేమ సాగింది.

పరీక్షలైన చివరిరోజు ఇద్దరం వీడ్కోలు చెప్పు కున్నాం.

ఇద్దరి కళ్లలోనూ దిగులు, వదలలేక వదల్లేక వెళ్లింది ఆమె. ఆ వేసవి సెలవుల ఎడబాటే మాలో భయాన్ని, బెరుకుని పోగొట్టింది. మళ్లీ కలిసిన వెంటనే ఒకరి మనసును మరొకరికి చెప్పుకొనేలా చేసింది.

''మన ప్రేమ చదువుకు అవరోధం కాకూడదు. నువ్వు కూడా బాగా చదువుకోవాలి. అలా అని ప్రామిస్ చెయ్యి'' అంది రమ్య తన కుడిచేతిని చాచి.

''ప్రామిస్'' అన్నాను ఆమె చేతిలో చెయ్యి వేసి.

ఆ సుతిమెత్తని స్పర్శ నేనిప్పటివరకూ మరిచి పోలేదు. ఇంటర్ తరువాత తను Ag.Bscలో చేరింది. ఎంబిబిఎస్‌లో సీటు దొరకక నేను B.H.M.S.లో చేరాను.

కాలేజీలు వేరైనా ఇద్దరమూ తరచూ కలుసు కొని గంటల తరబడీ కబుర్లలో మునిగిపోయే వారం. అనుకున్న రోజున నేను కలవలేకపోతే మళ్లీ కలిసినప్పుడు ఏడ్చి గోలచేసేది. రమ్యను మళ్లీ మామూలు స్థితికి తేవడానికి చాలా కష్టపడాల్సి వచ్చేది.

అలా ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంతగా ప్రేమలో కూరుకుపోయాం. నాకైతే రమ్య నా శరీరంలో ఒక భాగమే. అనే ఫీలింగ్. నా ప్రాణం పోయే వరకూ ఆ ఫీలింగ్ మారదనే నమ్మకం దృఢంగా ఉంది నాకు. డిగ్రీ పూర్తవగానే రమ్య ఉద్యోగాన్వేషణలో పడింది. నేను ''కంప్యూటరైజ్‌డ్ క్లినిక్'' ప్రారంభించాను. నా క్లినిక్‌కి అనుబంధంగా హోమియో మెడికల్ షాపు కూడా ఉండడంతో నా ప్రాక్టీసు పుంజుకోవడానికి కారణమైంది.

క్లినిక్ ఓపెనింగ్ రోజున పనిలో పనిగా రమ్యను నానమ్మకి పరిచయం చేశాను. రమ్యనొకసారి తేరి పార చూసి అప్పటికి మౌనంగా ఉండిపోయింది నానమ్మ.

రెండురోజుల తర్వాత ఊరెళ్లడానికి బట్టలు సర్దు కుంటూ చెప్పింది. ''పదిహేను రోజుల క్రితం మనింటికి మీ మేనమామ ముకుందం వచ్చాడురా. తన కూతురు గాయత్రిని నీకు చేసుకొమ్మని బ్రతిమ లాడాడు. నువ్వు, గాయత్రి చిన్నప్పుడు మంచి స్నేహితులేగా'' అంది నానమ్మ.

నేను మౌనంగా ఉండడంతో తన మాటలను కంటిన్యూ చేస్తూ ''గాయత్రి ఇప్పుడు ఎంత అందంగా ఉందో! ఆర్నెల్ల క్రితం మన చుట్టాలింటికి పెళ్లికి వెళ్లినప్పుడు చూశాను. నువ్వూ దానిని చూసి చాలా ఏళ్లు గడిచింది. లాంఛనంగా పెళ్లి చూపులకు వస్తామని ఉత్తరం రాయనా?'' అంటూ తన ఉద్దే శాన్ని తెలుపుతూ అంది నానమ్మ.

''వద్దు నానమ్మ.... నేను రమ్యను ప్రేమిస్తు న్నాను. రమ్యను తప్ప మరో స్త్రీని నా భార్యగా స్వీక రించలేను.'' ధైర్యంగా అన్నాను.

''రమ్యంటే మొన్న వచ్చిన అమ్మాయా?'' అడి గింది

''అవును నానమ్మ'' డ్రస్ చేసుకోవడం పూర్తి అవడంతో వాచీ పెట్టుకుంటూ అన్నాను.

''ఆ అమ్మాయి కులం, గోత్రం ఏమిటో తెలుసు కున్నావా? నువ్వు కులం కాని అమ్మాయిని చేసు కుంటే మనుళ్లో నా పరువేం కాను?'' కోపంతో స్వరం పెంచుతూ అంది నానమ్మ.

''అవన్నీ నా కవసరం లేదు. నేను ప్రేమిస్తున్నది రమ్యను'' నా ధైర్యానికి నాకే ఆశ్చర్యం వేసింది.

''పండూ... నువ్వేనా... నువ్వేనా ఇలా మాట్లా డుతున్నావ్?'' గద్గద స్వరంతో అంది నానమ్మ.

''ఏం... నానమ్మ... నేను మాట్లాడిన మాటలో తప్పేమైనా ఉందా?'' అడిగాను.

''లేదురా... తప్పు నాది... నువ్వింకా ఆనాటి నా మనువడు పండువే అనుకుంటున్నాను... చూడు అదేరా నా తప్పు... నువ్విప్పుడు డాక్టర్ ప్రవీణ్‌వి కదా! చాలా ఎత్తుకు ఎదిగిపోయావురా. ఏదో నా కర్తవ్యం నేను చేశాను. ఇక నీ పెళ్లి నీ ఇష్టంరా నాన్నా''

నానమ్మ స్వరంలో బాధతో కూడిన వ్యంగ్యం ధ్వనించింది.

పెట్టె పట్టుకొని బయలుదేరింది.

''నేను నిన్ను బాధపెట్టాలని అన్లేదు..'' అంటూ ఇంకా ఏదో చెప్పబోయాను.

''వద్దురా... ఏమీ చెప్పకు. నే వెళ్తున్నా'' అంటూ గేటు బయటకు వెళ్లింది నానమ్మ.

''నేను బస్టాండ్ దాకా వస్తానుండు'' అంటూ బయలదేరబోయాను.

''వద్దు....'' గట్టిగా అరిచింది.

''వద్దు... నావెంట రావద్దు. వచ్చావంటే నా మీద ఒట్టే...''

కుడిచేతి చూపుడు వేలుతో బెదిరిస్తున్నట్లుగా అంది. నానమ్మ ముఖం కోపంతో జేవురించి ఉండడం వలన ఉన్నచోటే ఉండిపోయాను. కొంగుతో కన్నీళ్లు తుడుచుకుంటూ ఆటో ఎక్కి వెళ్లి పోయింది.

ఛా... అనవసరంగా విషయం చెప్పి బాధ పెట్టానే అనుకున్నాను.

అయినా ఎప్పటికైనా తెలియాల్సిందేగా... అయినా నానమ్మ కోపం ఎన్నాళ్లు... వారం తర్వాత వెళ్లి ఒడిలో తలపెట్టుకొని పడుకున్నానంటే కరిగి పోదూ... అనుకొంటూ లోపలకొచ్చి సోఫాలో కూలబడ్డాను.

ఐదు నిమిషాల తరువాత ఎవరో వస్తున్న అలికి డికి గుమ్మం వైపు చూశాను.

రమ్య లోపలకి వస్తోంది. ఆమె ముఖంలో ఏదో కొత్త కాంతి కనిపించింది నాకు.

''వెల్‌కం మేడం'' నవ్వుతూ ఆహ్వానించాను రమ్యను

నా పక్కనే వచ్చి కూచుంది తను

''ప్రవీ నీకో గుడ్ న్యూస్'' చెప్పింది సంతో షంగా

''తొందరగా చెప్పు మరి'' అన్నాను తన ఉత్సా హాన్ని చూసి ఆనందిస్తూ...

''నాకు జాబ్ వచ్చింది. గుజరాత్‌లోని ఆనంద్ లో'' చెప్పింది.

ఒక్క క్షణం స్థాణువులా మారిపోయాను. ''ఇది గుడ్ న్యూసా'' కాస్త కోపంగా అన్నాను.

''కాదా? ఎంత కష్టపడి ఇంటర్వ్యూకి ప్రిపేర్ అయ్యాను? సక్సెస్ అయ్యానంటే అభినందించ కుండా బాధపడతావేంటి?'' అంది బుంగమూతి పెడుతూ..

''ఈ విషయం నీకు గుడ్ న్యూసే, నాకే బాడ్ న్యూస్. నువ్వు దూరమయ్యే విషయం ఏదైనా నాకు బ్యాడే'' అన్నాను అలుగుతూ...

''ప్రవీ... డోంట్ బి సిల్లీ.... నేను జాబ్ చేసేది ఎవరికోసం? మన ఫ్యూచర్ కోసమేగా? అంటూ ఆగి..


''ఓన్లీ టూ ఇయర్స్ ప్రవీ... ఆతర్వాత ఇక్కడే జాబ్ చూసుకొని వచ్చేస్తా...'' అంది నాకు మరింత దగ్గరగా జరుగుతూ...


రమ్య చుట్టూ చేతులు వేసి ఇంకా దగ్గరగా ఒకరి ఊపిరి ఒకరికి తగిలేంత దగ్గరగా లాక్కున్నాను.

''ప్రామిస్...' అడిగాను తన కళ్లలోకి ఆర్తిగా చూస్తూ...

''ప్రామిస్'' కనురెప్పలను ఆరుస్తూ చెప్పింది రమ్య.

''ప్రవీ... ఒక విషయం చెపుతాను ఏమీ అనుకో కూడదు'' తన మునివేళ్లతో నా క్రాఫ్‌ని సవరిస్తూ గోముగా అంది రమ్య.






''చెప్పరా...'' ప్రేమగా అన్నాను.

''అక్కడ డాడీకి తెలిసిన వారింట్లో నేను పేయింగ్ గెస్ట్‌గా ఉండబోతున్నాను. ఆయన చాలా స్ట్రిక్ట్ మనిషట. అందుకని నువ్వు నాకు ఫోన్ చేయ కేం'' అంది.

''ఇంపాజిబుల్... నీతో మాట్లాడకుండా నెలల తరబడి నేనుండలేను. ఫోన్ చేసే తీరుతాను'' మొండిగా అన్నాను.

''ప్లీజ్ ప్రవీ...ప్లీజ్... నేనే ప్రతి సండే నీకు ఫోన్ చేస్తాను'' అర్థింపుగా అంది రమ్య.

''హూ... ఇలా రిక్వెస్ట్ చేసి బుట్టలో పడేయడం బాగా నేర్చుకున్నావ్''

''నేను మాట పూర్తి చేసేలోగా రమ్య సెల్ మోగింది. ఫోన్‌లో మాట్లాడాక చెప్పింది. ''ప్రయాణానికి సర్దుకోవాల్సినవి చాలా ఉన్నాయి. తొందరగా రమ్మని డాడీ హడావుడి చేస్తున్నారు. ఇక ఉంటాను ప్రవీ....'' చివరి మాట కాస్త బాధగా అన్నట్లు నాకనిపించింది.

''ఓకే... మైడియర్... ఐ విష్ యు ఆల్ సక్సెస్'' రమ్య చేతిని నా చేతిలోకి తీసుకొని సున్నితంగా నొక్కాను.

''థ్యాంక్యూ'' అంటూ కొన్ని సెకన్ల పాటు నా కళ్లలోకి చూస్తూ ఉండిపోయింది. వెంటనే తేరుకుని ''బై ప్రవీ'' అంటూ గిరుక్కున వెనుదిరిగి వెళ్లిపోయింది రమ్య.

నా కళ్లలోంచి రెండు కన్నీటి చుక్కలు జారి నా షర్టుపై పడ్డాయి. బహుశా రమ్య కళ్లు కూడా చెమర్చేవుంటాయి. అదిగో అప్పటి నుంచే ఇలా ఆదివారం కోసం ఎదురు చూస్తూ మిగతా ఆరు రోజులు గడపడం అలవాటైపోయింది నాకు.

భర్త ఎడబాటుని భరించడానికి ఊర్మిళ నిద్రపోయిందని పురాణాల్లో చదివాను. నా రమ్య ఎడబాటుని తట్టుకోవడానికి పుస్తక పఠనాన్ని ఎంచుకున్నాను నేను.

నా వృత్తికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు తెప్పించుకొని చదవడం ప్రారంభించాను. మధ్య మధ్యలో రిలాక్స్ కోసం పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పుస్తకాలు, సైన్స్ ఫిక్షన్ కూడా చదవడం అలవాటైంది.

ఈ రెండేళ్లలో నా ప్రాక్టీసు నేను ఊహించనంతగా అభివృద్ధి చెందింది.

మధ్యతరగతి వారు, పేదవారు చాలా మంది వచ్చేవారు ట్రీట్‌మెంట్ కోసం.

ముఖ్యంగా జాండీస్, థైరాయిడ్, డయాబెటిస్, ఒబెసిటీకి సంబంధించిన ట్రీట్‌మెంట్ నేను బాగా ఇస్తానని పేరు సంపాదించుకున్నాను.

ఈ సక్సెస్ ఇచ్చిన ప్రోత్సాహంతో ప్రతినెలా చివరి మూడు రోజులూ మా పల్లెటూరులోని పేద వారికి ఉచితంగా సేవ చేయడం చూసి నానమ్మ పొంగిపోయింది.

''మీ తాతగారు కూడా ఇంతేరా... పేదవారని తెలిస్తే ఆ పేషెంట్ దగ్గర ఒక్క పైసా కూడా తీసుకోకుండా మందులిచ్చేవారు. నా ఆయుష్షుకూడా పోసుకొని నూరేళ్ల బ్రతుకు'' అంటూ తన రెండు చేతుల్ని నా మొహం చుట్టూ తిప్పి మెటికలు విరిచి దిష్టి తీసింది.

నానమ్మకు ఇప్పుడు నాపై కోపం పూర్తిగా తగ్గిపోయింది. కానీ ఇంతవరకూ నా పెళ్లి ఊసెత్తలేదు. బాగా పట్టుదల కల మనిషి. నాలోనూ ఆవిడ రక్తం ప్రవహిస్తోందిగా! అందుకే నేను రమ్య విషయంలో పట్టువదలని విక్రమార్కుడిలా ఉన్నాను.

ఇంకెంత మహా అయితే రెండు నెలల్లో రమ్య వచ్చేస్తుంది. వాళ్ల పెద్దవాళ్లకు కూడా మా విషయం చెప్పి పెళ్లి చేసుకోవడమే తరువాయి కార్యక్రమం.

ఫోన్ మోగుతోంది... చూశా.. అది నా రమ్య ఫోన్.

''హలో రమ్యా'' ఫోన్ తీసి ఆత్రంగా అన్నాను.

''హాయ్..ప్రవీ'' ఫోన్‌లో రమ్య గొంతు బద్ధకంగా వినిపించింది.

''ఏంట్రా ఇప్పుడే నిద్ర లేచినట్లున్నావ్'' అడిగాను

''అవును ప్రవీ...రాత్రి చదువుకుంటూ పడుకునే టప్పటికి ఒన్ థర్టీ అయింది. ఇప్పుడు లేవాలని పించలేదు.''

అదే బద్ధకం వాయిస్ కంటిన్యూ చేస్తూ అంది.

''అరే బుద్ధూ... అంత సేపు చదవడం దేనికీ? ఇంతకీ ఏ పుస్తకం చదివావ్?'' ముద్దుగా చివాట్లేస్తూ కుతూహలంగా అడిగాను!

''ప్రవీ... నీకు చెప్పలేదు కదూ... నేను టోఫెల్ ఎగ్జామ్‌కి ప్రిపేర్ అవుతున్నా'' చెప్పింది.

''టోఫెలా... అంటే నువ్వు ఫారిన్ వెళ్లే ప్రయత్నంలో ఉన్నావా?'' వెంటనే సీరియస్ అయ్యాను నేను.

''యా...'' రమ్య స్వరంలో ధ్వనించిన నిర్లక్ష్య ధోరణికి నా గుండె రగిలిపోయింది.

''రమ్యా...సీరియస్‌గా అడుగుతున్నాను... మన పెళ్లి...'' నామాట పూర్తి కాకుండానే అంది

''అవన్నీ ఆలోచించే టైం లేదు ప్రవీ... ఇంకా చదవాల్సింది చాలా ఉంది... బై'' అంటూ స్విచ్ ఆఫ్ చేసింది రమ్య.

నా కాళ్ల కింద భూమి కదులుతున్నట్లుగా అనిపించి నాకు

ఇలా మాట్లాడింది నా రమ్య కాదు. ఇంకెవరితోనో మాట్లాడాను అనుకున్నాను.

కానీ ఆ మాట్లాడింది రమ్యేనన్న విషయం మూడు నెలల తర్వాత వచ్చిన తన వెడ్డింగ్ కార్డ్ చెప్పింది.

ఏమైంది తనకి? ఎందుకిలా చేసింది? ఒకప్పుడు నేను కనిపించని రోజు ఏడ్చి గోల చేసిన రమ్య ఇలా మారడం సాధ్యమా? నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

నేను చాలారోజుల క్రితం చదివిన ఒక పుస్తకంలోని వాక్యాలు గుర్తొచ్చాయి.

''కాలంతో పాటు మనిషి శరీరంలోనే కాదు మనసులోనూ మార్పు వస్తుంది. మార్పు అన్నది మనిషి జీవితంలో సహజంగా జరిగే ప్రక్రియ. తానుండే వాతావరణం, పరిసరాలు,

సామాజిక ఆర్థిక పరిస్థితులు మనిషిని మారేలా చేస్తాయి. మార్పు మనిషి లక్షణం''

ఆ వాక్యాలు గుర్తొచ్చాక అనుకున్నాను

నిజమే రమ్య అందివచ్చిన అవకాశాలను వినియోగించుకొంటూ ఒక్కొక్క మెట్టే ఎక్కి వెళ్లిపోయింది. ఆమె చూపు పై మెట్టు మీదే ఉంటుంది. కిందకి తొంగి చూసే అవసరం ఆమెకు లేదు. విదేశాల్లో స్థిరపడే ఆలోచనలో ఉన్న రమ్యకి ఉన్నచోటే ఉపాధి కల్పించుకుని ఉండిపోయిన నేను బహుశా తగనేమో! మరో నెలరోజుల్లో ముకుందం మామయ్య కూతురు గాయత్రిని పెళ్లి చేసుకున్నాను. మొదటిరాత్రి గదిలోకి రాగానే కన్నీళ్లు పెట్టుకున్న గాయత్రిని చూసి

''ఏమైంది'' కంగారుగా అడిగాను

''నన్ను క్షమించు బావా, చిన్నప్పటి మన స్నేహాన్ని మరిచిపోయి నువ్వు మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటావేమోనని నీ గురించి తప్పుగా ఊహించాను. దేవుడి లాంటి నీ గురించి అలా అనుకోవడం తప్పుకదా'' గాయత్రి అమాయకంగా అడిగినా ఆ ప్రశ్న సూటిగా తాకింది నా గుండెను

సమాధానం చెప్పలేక గాయత్రిని నా గుండెలకేసి హత్తుకొన్నాను.

★